అన్ని వర్గాల అభివృద్ధికి సర్వే దోహదం

సర్వే పైమంత్రి మండలి నిర్ణయం ప్రకారం శాసనసభ తీర్మానం

వికారాబాద్, నవంబర్ 5 : రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే) చేపట్టాలని మంత్రిమండలి నిర్ణయం ప్రకారం తెలంగాణ శాసన సభ తీర్మానించిందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వే ప్రధాన ఉద్దేశం రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి , రాజకీయ అవకాశాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం ప్రభుత్వానికి సరైన నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుందని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించ డానికి 2024 మంది ఎన్యూమరేటర్లు , 208 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని గ్రామాలు, ఆవాసాలు, మండలాలు, మునిసిపాలిటీల్లో గల 2030 ఎన్యూమరేషన్ బ్లాక్ లలో మొదటి విడతగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఇంటింటికివెళ్లి జిల్లాలోని సుమారు 2 లక్షల 90 వేల కుటుంబాలను నమోదు చేసి'ఇండ్ల జాబితాలు తయారుచేయనున్నట్లుతెలిపారు. కుటుంబాలను నమోదు చేసిన తరువాత వారి ఇంటిపై ఒక స్టికర్ అంటించడం జరుగుతుందన్నారు. కుటుంబాల నమోదు తరువాత రెండవ విడత వారి కుటుంబమును సందర్శించి కుటుంబములోని వ్యక్తి వారిగా కుటుంబము వారిగా ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ , కులవివరాలను సేకరిస్తారన్నారు. ఈ వివరా లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ప్రజలు సహకరించాలని తెలిపారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

పెద్దేముల్ : మంబాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు

పెద్దేముల్, నవంబర్ 5 : విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి తుల్జప్ప అన్నారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఇందూరు ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులకు,కందనెల్లిలో ఏడుగురికి , మంబాపూర్‌లో ఆరు మందికి, తట్టేపల్లిలో ముగ్గురు ఇతర పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించిన మెటీరియల్‌ను ఏకలవ్య ఫౌండేషన్ తరపున ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు తుల్జప్ప, రాములు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా విని ఓ ప్రణాళికా బద్ధంగా చదువుకొని జీవితంలో ఉన్నతంగా స్థిరపడి తల్లిదండ్రులు,గ్రామానికి, పాఠశాలకు,ఉపాధ్యాయులకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,శివకుమార్,పీడీ రాధాకృష్ణ,ఉపాధ్యాయులు నజీయా బేగం,నిర్మల,ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ధారూరు, నవంబర్ 5: రైతులు తమ పశువులను అనారోగ్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ధారూరు మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ శ్వేత అన్నారు.మంగళవారం మండల పరిధిలోని నాగుసాన్‌పల్లి గ్రామంలో పశువు వైద్య శిబిరం నిర్వహించి ఉచిత గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. అలాగే 62 పశువులకు గాలికుంటు టీకాలు, 28 దూడలకు నట్టల మందులు, 132మేకలకు నట్టల మందులు, 16పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకటయ్య, ఉప సర్పంచ్ రమేశ్ పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

దౌల్తాబాద్, నవంబర్ 5: రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని పొలాల దగ్గర ఉన్న కల్లా ల దగ్గరనే ఆరబెట్టుకుని తాలు లేకుండా 17 శాతం తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని డీఎస్‌వో హరిబాబు, ఏవో లావణ్య సూచించారు. కార్యక్ర మంలో కడా అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ గాయత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబ య్యగౌడ్, నారాయణపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంజుల, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత ప్రారంభం

మర్పల్లి, నవంబర్ 5 : రైతులు పశువుల సంతను వినియోగించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సురేశ్ యాదవ్, సీనియర్ నాయకులు రాములు యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లతో కలిసి పశువుల సంతను ప్రా రంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కాలం నుంచి సంత నిర్వహించడం లేదని, ప్రతి మంగళవారం సంత కొనసాగుతుందని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారు దవఖానాల్లో చికిత్సలు చేయించుకున్న బిల్లులతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తులు చేసుకోగా వారికి వచ్చిన సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశాలతో లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల నాయకులు పాల్గొన్నారు..

కష్టపడి పనిచేస్తే మంచి గుర్తింపు



ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో అబీబ్‌హైమద్,

కులకచర్ల, నవంబర్ 5: కష్టపడి పనిచేసే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉంటుందని కులకచర్ల మండల విద్యాధికారి అబీబ్‌హైమద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొంరెడ్డిపల్లి గ్రామంలోని పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సూర్య, అరుణ, లక్ష్మణ్ లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేశ్‌కు మార్, ఉపాధ్యా యుల ఆధ్వర్యంలో వీడ్కోల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఉన్న సమయంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎప్పుడు మర్చి పోరన్నారు. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. అన్ని వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదన్నారు. కార్యక్రమంలో బండవెల్కిచర్ల కాంప్లెక్స్ పాఠశాల హెచ్ఎం శరత్‌కృష్ణ, ఉపాధ్యాయులు బస్వరాజ్, వెంకటయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రమ్మ, మాజీ చైర్మన్ నల్లమల కృష్ణ, సీఆర్పీ కృష్ణయ్య, సాల్వీడ్ పాఠశాల ప్రధానోపాధ్యా యులు రాములు, స్కూల్ అసిస్టెంట్ నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్ కవిత, మణెమ్మ, శివలీల, గ్రామస్తులు కృష్ణయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుయ్యాని

తాండూరు, నవంబర్5: మిల్లర్ల సమస్యలు సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అయా శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు పాల్గొని వరిధాన్యం కొనుగోళ్ల సమయంలో మిల్లర్లకు తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. తాండూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా వరిని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

రంజీ ట్రోఫీకి ఎంపిక

వికారాబాద్, నవంబర్ 5 : ఎస్ఎస్ క్రికెట్ అకాడమీ వికారాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటూ నాలుగు సంవత్సరాలుగా కష్టపడ్డ స్టూడెంట్ రాజ్ అరుణాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ నుంచి రంజీ ట్రోఫీకి ఎంపికయ్యాడు. తన జీవిత లక్ష్యా నికి మార్గం నిర్దేశించిన కోచ్ రమేశ్ , సంతోష్‌లకు రాజ్ ధన్యవాదాలు తెలిపారు. రాజ్ రంజీ ట్రోఫీకి ఎంపిక అవ్వడం పట్ల కోచ్ హర్షం వ్యక్తం చేశారు. వికారాబాద్ నుంచి ఇంకా ప్రతిభగల విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి జట్లకు ఎంపిక య్యేలా ఎస్ఎస్ క్రికెట్ అకాడమీ వికారాబాద్ తోడ్పడుతుందన్నారు.

సివిల్ వివాదంలో గచ్చిబౌలి ఎస్ఐ

సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదుచేసిన బాధితుడు

శేరిలింగంపల్లి, నవంబర్ 5: గోపన్‌పల్లి సోఫాకాలనీలో ఓ ప్లాట్‌కు సంబంధించి సివిల్ వివాదంలో గచ్చిబౌలికి చెందిన ఓ ఎస్ఐ తలదూర్చి ఏకపక్షంగా వ్యవహరించారంటూ కాలనీకి చెందిన నవాజ్ అనే వ్యక్తి సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, మాదాపూర్ డీసీపీ వినీత్‌లకు ఫిర్యాదు చేశారు. మంగళవారం నవాజ్ అందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గోపన్‌పల్లి సర్వేనంబర్ 124/రు, సోఫాకాలనీ ప్లాట్‌నంబర్ 25లో 200 చదరపు గజాల స్థలాన్ని నానక్‌రాంగూడకు చెందిన మునావర్ పాషా నుంచి తాను కొనుగోలు చేశానని, సదరు ప్లాట్ విక్రయ లావాదేవీలు గచ్చిబౌలి ఎస్ఐ మహేందర్ రెడ్డి సమక్షంలో చేసుకున్నామని, అందుకు అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు చెల్లించానని తెలిపారు. మిగతా డబ్బును సమకూర్చడంలో కొంతజాప్యం జరగడంతో సదరు ప్లాట్‌ను గోపన్‌పల్లికి చెందిన మరొకరికి విక్రయించారని పేర్కొన్నారు. కాగా.. షేక్ షుకూర్ అనే వ్యక్తి గత 13 సంవత్సరాలుగా సదరు ప్లాట్‌లో పొజిషన్‌లో ఉండగా, ఎస్ఐ మహేందర్ రెడ్డి ..అతడిని భయభ్రాంతులకు గురిచేసి మునావర్ పాషాకు పొజిషన్ ఇప్పించారని తెలిపారు. సదరు ప్లాట్ విషయంలో షుకూర్‌కు అన్యాయం చేశారని, ఇప్పుడు తనకు డబ్బులు తిరిగి ఇవ్వకపోగా బెదిరింపులకు గురిచేస్తున్నారని, ప్లాట్ పొజిషన్, అమ్మకం విషయంలో ఎస్ఐ కీలకంగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా.. సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని, దీనిపై విచారణ చేపట్టి వాస్తవాలను తెలియజేస్తామని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబ్‌ఉల్లాఖాన్ తెలిపారు.

యాలాల, నవంబర్ 5: యాలాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వో చంద్రశేఖర్ స్థానంలో నూతనంగా బదిలీపై వచ్చిన సీహెచ్ఓ చంద్రప్రకాశ్‌కు పీహెచ్‌సీవో సిబ్బంది ఘనంగా సన్మానించారు. మంగళవారం ఆశ డే ను పురస్కరించుకొని 31 మంది ఆశ కార్యకర్తలకు ఐదు రిజిస్టర్ల చొప్పున పంపిణీ చేశారు. అనంతరం సీహెచ్‌వో చంద్ర ప్రకాశ్‌కు పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ఏర్పాట్లు పూర్తి

సర్వేపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్

కొడంగల్, నవంబర్ 5: సమగ్ర కుటుంబ సర్వేకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించే ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, ఉపాధి, కుల, విద్య, రాజకీయ తదితర అంశాలపై బుధవారం నుంచి సర్వే ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో 12 వార్డుల్లో సర్వే చేపట్టేందుకు గాను మొత్తంగా 34 మంది సిబ్బంది నియమించినట్లు తెలిపారు. మొదటి రోజు మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి సర్వేను ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్‌సింగ్‌తో పాటు ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మర్పల్లి, నవంబర్ 5 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై మల్లేశం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కూరగాయాల సంత వద్ద వివిధ గ్రామాల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం జరిగే సంతకు వచ్చిన వారు తమ సరుకులు, సెల్‌ఫోను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. మైనర్లకు బైకులు ఇస్తే యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వివాహాలు చేయకూడదని చేస్తే వచ్చే సమస్యల గురించి వివరించారు.. ఎక్కడైనా బాల్య వివాహాలు చేసినట్లు తెలిస్తే 1098, లేదా 100కు సమాచారం అందివ్వాలని సూచించారు.

మనీలాండరింగ్ కేసు నమోదయ్యిందంటూ..

వృద్ధురాలి నుంచి రూ.31 లక్షలు కాజేసిన సైబర్‌చీటర్స్

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): మేము సీబీఐ, ఈడీ నుంచి మాట్లాడుతున్నాం.. మనీలాండరింగ్ కేసులో మీరు నిందితురాలిగా ఉన్నారు.. మిమ్మల్ని అరెస్ట్ చేసేందుకు వస్తున్నాం.. అంటూ బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఓ వృద్ధురాలి వద్ద నుంచి రూ. 31 లక్షలు దోచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలికి ఫోన్ చేసిన సైబర్‌నేరగాళ్లు.. మేం పోలీసులమని, నరేశ్ గోయెల్‌కు సంబంధించిన మనీ లాండరిగింగ్ కేసులో మీ పేరుతో ఉన్న కెనరా బ్యాంకు ఖాతాకు సంబంధించిన ఏటీఎం నుంచి రూ.2 కోట్లు, 40 లావాదేవీలు జరిగినట్టు దర్యాప్తులో తేలిందని చెప్పారు. మిమ్మల్ని అరెస్ట్ చేసేందుకు వస్తున్నామంటూ వీడియో కాల్ చేసి హెచ్చరించారు. మీరు ఈ విషయాన్ని ఎవరితో చెప్పవద్దంటూ బెదిరించారు. మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును తొలుత ఆర్‌బీఐ ఖాతాలోకి పంపించండి.. ముందుగా మీరు అరెస్ట్ నుంచి బయటపడుతారు.. మీ పాత్ర లేదని తేలితే ఆ డబ్బు మీకు తిరిగి రెండు రోజుల్లో వచ్చేస్తాయంటూ నమ్మించి బాధితురాలి వద్ద నుంచి రూ. 30,96,500 వివిధ ఖాతాల్లో డిపాజిట్ చేయించుకున్నారు. రెండు రోజుల తర్వాత బాధితురాలు ఫోన్ చేయగా ఎవ్వరూ స్పందంచ లేదు. దీంతో బాధితురాలు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కల్తీ కారం పొడి తయారు చేస్తున్న వ్యక్తి అరెస్టు

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): కల్తీ కారం పొడిని తయారు చేస్తున్న వ్యక్తిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌కు చెందిన రూపారం ఖాత్రీ అలియాస్ రూపేశ్ కొన్ని సంవత్సరాల కిందట హైదరాబాద్‌కు వలస వచ్చాడు. అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో ఉంటూ గార్మెంట్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ వ్యాపారంలో లాభాలు రాకపోవడంతో మానేశాడు. ఆ తర్వాత కారం పొడి తయారు చేసేందుకు ఫ్లోర్ మిల్‌ను ఏర్పాటు చేశాడు. ఇందుకు సంబంధించిన ఉస్మాన్‌గంజ్‌లో ఏర్పాటు చేశాడు. స్వస్తిక్ బ్రాండ్ పేరుతో సాచెట్స్ తయారు చేయించి రెడ్ కలర్, ఆయిల్, ఇతర రసాయనాలతో ఎర్ర కారం పొడిని తయారు చేస్తున్నాడు. ఈ కారం పొడిని స్వస్తిక్ బ్రాండ్‌తో బయట మార్కెట్లో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి.. రూ.4 లక్షల విలువైన కల్తీ పొడర్, ముడి పదార్థాలు, ఫ్లోర్ మిల్ సామగ్రి, తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

మిస్సింగ్ సెల్‌ఫోన్ల రికవరీలో..

సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌ను అభినందించిన డీజీపీ

ఎల్బీనగర్, నవంబర్ 5: మిస్సింగ్ సెల్‌ఫోన్స్‌ను రికవరీ చేయడంలో తెలంగాణలోనే సరూర్‌నగర్ పోలీసులు అగ్రస్థానంలో నిలిచారు. పోయిన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేసిన సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని తెలంగాణ డీజీపీ జితేందర్ అభినందించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మిస్సింగ్ అయిన సెల్‌ఫోన్లను రికవరీ చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే రెండవ స్థానంలో నిలిచినట్టు పోలీసులు తెలిపారు.

ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల

కొడంగల్, నవంబర్ 5: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చెరువుల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నదని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బొంరాస్‌పేట మండలంలోని ఏర్పుమళ్ల గ్రామ కాక్రవేణి ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందశాతం సబ్సిడీతో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ రూ.లక్షా 80వేల వ్యయంతో లక్షా 15వేల 500 చేపపిల్లలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్,ఎంపీడీవో వెంకన్నగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్‌తో పాటు నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్‌రాములు గౌడ్, అంజిల్‌రెడ్డి వెంకటయ్య, నర్సింహనాయుడు, దేశ్యా నాయక్, రాములు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏక్ పేడ్ మా కే నామ్ ...

మొక్కలు నాటి నీరు పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, నవంబర్ 5 : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్ మా కే నామ్ అనే నినాదంలో భాగంగా నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో మంగళ వారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు మహావీర్ హాస్పిటల్ రోడ్డులో మున్సిపల్ పార్కులో చైర్‌పర్సన్ మంజుల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిని కాపాడడంతో పాటు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. అనంతరం అనంతగిరిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో చైర్‌పర్సన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కౌన్సిలర్లు చందర్ నాయక్, మోముల స్వాతి రాజ్‌కుమార్, కమిషనర్ జాకీర్ అహ్మద్, నాయకులు హసిబ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యువజన అధికారి ఐజయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యువత 'మత్తు' దారి పట్టొద్దు..

కొడంగల్, నవంబర్ 5: యువత పెడదారిన వెళ్లి, జీవితాలను అంధకారం చేసుకోవద్దని తెలంగాణ సాంస్కృతిక సాధన కళాకారులు ఆట పాటతో అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని అన్నారం గ్రామంలో డ్రగ్స్ నివారణలో భాగంగా కళాప్రదర్శన చేపట్టారు. డ్రగ్స్ వాడకం చట్టరీత్యా నేరమని, డ్రగ్స్, మత్తు పదార్థాలతో జీవితం అంధకారంగా మారిపోతుందని తెలిపారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, యువకులు ఆదర్శవంతంగా ఉండి కుటుంబాలను తీర్చిదిద్దుకొని దేశాభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెంకట్రాములు, అన్నుబాయి, అర్చన, శ్రీను, సంజీవ, భిక్షపతి, సంధ్య స్వర్ణలత పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు..

పూడూరు,నవంబర్ 5 : పూడూరు మండలం మన్నెగూడ చౌరస్తాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి,బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు పూడూరు మల్లేశం పార్టీ మండలఅధ్యక్షుడు రాఘవేందర్, వెంకటయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐదు లారీలు పట్టివేత

ఒక లారీపై కేసు నమోదు

పరిగి, నవంబర్ 5: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు లారీలను పరిగి పోలీసులు పట్టుకొని చివరకు ఒక లారీకి అనుమతి లేదని కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే ములుగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పరిగి పోలీసులు ఐదు లారీలు పట్టుకున్నారు. నాలుగు లారీలకు అన్ని అనుమతులు ఉన్నాయని, కాగా జిల్లాలోని ఇతరచోట్లకు ఇసుకను తరలించాల్సి ఉండగా పరిగికి తీసుకువచ్చారని పేర్కొంటూ మరోసారి ఇలాంటివి చేయరాదని హెచ్చరించి నాలుగు లారీలు వదిలేసినట్లు పోలీసులు పేర్కొం టున్నారు. ఒక లారీకి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలించినందుకు కేసు నమోదు చేయడం తో పాటు ఇసుక లారీని పరిగి తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఇదిలావుండగా పోలీసులపై వచ్చిన ఒత్తిళ్లతోనే నాలుగు లారీలు వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

PUBLIC NOTICE

Notice is hereby given to General Public that our client is intending to purchase All that the Plot Nos. 405, 406, 415/P (Eastren Part) & 416/P (Eastern Part), land admeasuring 800 Square Yards or 668.8 Square Meters, in Survey No. 306/Part Situated at "Manasa Hills" Budvel Village under GHMC, Rajendra nagar Circle in the State of Telangana. North: 40' Wide Road, South: Plot Nos. 407 & 414/Part, East: 40' Wide Road, West: Western Part of Plot Nos. 415 & 416 from, Sri Guduru Pratap Reddy S/o Sri G Malla Reddy. Any person having or claiming any right, interest, claim, demand or benefit whatsoever in respect of the Schedule Property by way of sale, exchange, mortgage, gift, trust, development rights, inheritance, bequest, possession, lease, license, tenancy, lispendens, lien, charge, maintenance, easement or under any Agreement or Power of Attorney whatsoever or otherwise howsoever, is hereby required to notify the same in writing with documentary proof thereof to the undersigned at the address as mentioned below, within Seven (7) days from the date hereof, failing which it shall be construed that either there is no claim, demand, right or interests whatsoever in or over the Schedule Property adverse to the aforesaid owner or the same has been waived for all intents and purposes and sale shall be completed.

Sd/- **PRAVEEN KUMAR JAIN**
Advocate
H.No: 14-1-18, Near Police Station
Mangalhat, Hyderabad-500006.
Cell: 9851609064